ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025 5

శ్రీ సత్యసాయి

దేశ సేవకుడా.. సెలవిక...

◆ వీరుడికి కన్నీటి వీడ్కోలు ◆ శోకసంద్రంలో కళ్లితండా ◆ చివరి చూపునకు తరలి వచ్చిన 'అనంత' జనం ◆ గ్రామ రహదారి మొత్తం జనసంద్రం

◆ జోహార్ మురళీ నాయక్ అంటూ హోరెత్తిన నినాదాలు ◆ త్రివర్ణ పతాకం రెపరెపల నడుమ అంతిమయాత్ర

◆ బరువెక్కిన హృదయాలతో సైనికుడికి అంతిమ వీడ్కోలు ◆ హాజరైన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు రాష్ట్ర మంత్రులు.

పాకిస్తాన్ కాల్పుల్లో అసువులు బాసిన అగ్నివీరుడికి ఆయన స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాలో ఆదివారం అశ్రు నయనాలతో తుది వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా కళ్లితండా శోకసంద్రంలో మునిగింది. వీరసైనికుడికి ప్రముఖులు నివాళి అర్పించారు. మంత్రి నారాలోకేష్ మురళీనాయక్ మృతదేహాన్ని మోసారు. ప్రభుత్వం నుంచి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, 300 గజాల ఇంటిస్థలం, 5 ఎకరాల భూమిని ఇస్తున్నట్లు ప్రకటించారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వ్యక్తిగతంగా రూ. 25 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. మురళీనాయక్ భౌతిక కాయానికి అధికార లాంఛనాలతో వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాకిస్తాన్ కాల్పుల్లో మృతి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం అశ్రునాయనాల నడుమ పూర్తయ్యాయి. మురళీ నాయక్ పార్థివ దేహాన్ని సందర్శించేందుకు అశేషంగా ప్రజలు తరలిరాగా, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యారు. గోరంట్ల మండలం కల్లితండాకు శనివారం రాత్రికే మురళీ పార్థివ దేహం చేరిన విషయం తెలిసిందే.అప్పటి నుంచే సందర్శకులు పెద్దఎత్తున కల్లితండాకు తరలొచ్చి వీర సైనికుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు మురళీ నాయక్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

వీరజవాను మురళీనాయక్ పార్థవ దేహానికి ఆఖరి సెల్యూట్ చేస్తున్న తల్లిదండ్రులు

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

పాక్ కాల్పుల్లో మృతి చెందిన మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. ఈ అంత్యక్రియలకు సైనికాధికారులతోపాటు, రాష్ట్ర పోలీసులు శాఖ తరుపున పోలీసు సిబ్బంది మురళీ నాయక్ ఇంటి నుంచి వారి వ్యవసాయ క్షేత్ర వరకు పెరేడ్‌గా తీసుకెళ్లారు. ఈ సమయంలో మురళీ నాయక్ అమర్ రహే... భారత మాతాకి జై అన్న నినాదాలు హోరెత్తాయి. అంత్యక్రియలు జరిగే ప్రాంతంలో గన్ షెల్యూట్‌తో గౌరవ వందనాన్ని అందించారు. అనంతరం జాతీయ పతకాన్ని మురళీనాయక్ తండ్రికి అందజేశారు. ఆ సమయంలో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సందర్శకులు ఉద్విగ్నతకు లోనయ్యారు.

అండగా ఉంటాం : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని మురళీ నాయక్ తల్లిదండ్రులకు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ భరోసానందించారు. వారి వద్ద కూర్చొని ఓదార్చారు. క్యాబినెట్‌లో చర్చించి ఐదు ఎకరాల పొలంతోపాటు, ఇంటి నిర్మాణానికి 300 గజాల స్థలం కేటాయిస్తామని హామీనిచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వం తరుపున అందే సహాయమే కాకుండా తాను వ్యక్తిగతంగా రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని ప్రకటించారు.

భౌతికకాయాన్ని మోసిన నారా లోకేశ్

వీర మరణం పొందిన మురళీ నాయక్ భౌతికకాయాన్ని నారా లోకేశ్ మోశారు. అంతకు మునుపు మురళీనాయక్ పార్థవదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. చిన్న వయసులో దేశ రక్షణలో మురళీనాయక్ ఆశువులుబాయడం బాధాకరమన్నారు. ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో స్థుపాన్ని నిర్మిస్తామని చెప్పారు. గ్రామస్తుల కోరిక మేరకు కల్లితండా పేరును మురళీ నాయక్ తండాగా మారుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని, మురళీనాయక్ తండ్రికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు.

కదిలివచ్చిన అశేష జనవాహిని

గోరంట్ల : పాకిస్తాన్ కాల్పుల్లో మృతిచెందిన వీరజవాను మురళీనాయక్ అంత్యక్రియలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అశేషజనవాహిని తరలివచ్చారు. మురళీనాయక్ స్వగ్రామం కల్లి తండాలో ఆదివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, సవితమ్మ, అనగాని సత్య ప్రసాద్, హోం మంత్రి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వీర జవానుకు నివాళులర్పించారు అగ్నివీర్ మురళి నాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. మురళి నాయక్ ఇంటి నుండి వ్యవసాయ క్షేత్రం వరకు సాగిన అంతిమయాత్రలో అశేషజనవాహిని పాల్గొంది. అంత్యక్రియల్లో భాగంగా ఆర్మీ పోలీసులు గాల్లోకి మూడుసార్లు కాల్పులుజరిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర, కాలవ శ్రీనివాసులు, నాయకులు పరిటాలశ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మురళి నాయక్ యువతకు ఆదర్శం

పుట్టపర్తి రూరల్ : దేశ సరిహద్దులో వీర మరణం పొందిన అగ్ని వీరుడు జవాన్ మురళి నాయక్ కుటుంబానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు. మురళి నాయక్ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం మురళి నాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయ్‌నిపరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మురళి నాయక్ వీరమరణం నేటి యువతకు ఆదర్శంగా ఉందన్నారు. పాతికేళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలర్పించి, భారత ప్రజల హదయాలను గెలుచుకున్న నిజమైన హీరోగా నిలిచిపోయారన్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది సమన్వయంతో వీర జవాన్ అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసే విధంగా విధులు నిర్వర్తించారు. పోలీస్ అధికారులు సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అందరికీ జిల్లా ఎస్పీ రత్న కృతజ్ఞతలు తెలిపారు.

వీరజవాను మురళీనాయక్ పార్థవ దేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు, తదితరులు

మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

మురళీనాయక్ పార్థివదేహాన్ని మోస్తున్న మంత్రి నారాలోకేష్

నేడు వైస్‌చైర్మన్ ఎన్నిక జరిగేనా..?

హిందూపురం మున్సిపల్ కార్యాలయం

కార్యాలయంలో కన్పించని ఏర్పాట్లు
విహార యాత్రలో వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ -1 జబివుల్లా పదవీ కాలం 4 సంవత్సరాలు పూర్తి కావడంతో అధికారంలో టిడిపి అవిశ్వాసం ఏర్పాటు చేసి ఆయనను పదవి నుంచి దింపాలని యత్నిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మున్సిపల్ వైస్‌చైర్మన్-1 అవిశ్వాసం కోసం అధికారులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే సమావేశానికి రెండు పార్టీల సభ్యులు హాజరు అయ్యేది అనుమానంగా ఉంది. తాము ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం గట్టెక్కే అవకాశం లేక పోవడంతో టిడిపిలో ఆందోళన నెలకొంది. వైసిపి కౌన్సిలర్లతో మంతనాలు చేసేందుకు ప్రయత్నించినా వారేవరూ పార్టీని వీడడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. మరో వైపున వైసిపి ఇన్‌ఛార్జి దీపికా భర్త వేణు రెడ్డి, వైస్‌చైర్మన్ జబివుల్లా కలిసి వైసిపి కౌన్సిలర్లందరిని ప్రత్యేక శిబిరానికి తరలించారు. ఒకే ఒక సభ్యుడు తప్ప మిగిలిన వారు అందుబాటులో లేకుండా వెళ్లి పోయారు. దీంతో సోమవారం జరిగే సమావేశ నిర్వహణకు అవసరమైన కోరం లభించేలా లేదు. ఈనేపథ్యంలో సంఖ్యా బలాన్ని సాకుగా చూపి అధికార పార్టీ వైస్‌చైర్మన్ ఎంపికను వాయిదా వేసే విధంగా చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుంది.

నల్లచెరువు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, కారులో మృతదేహాలు

లారీని ఢీకొన్న కారు... ముగ్గురు మృతి
ఒకరికి గాయాలు
మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు

ప్రజాశక్తి - నల్లచెరువు

రోడ్డు ప్రక్కన నిలిచి ఉన్న ట్రిప్పర్ లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో మృతిచెందిన వారు మదనపల్లివాసులని పోలీసులు తెలిపారు. నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి సమీపంలో ఆదివారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదానికి సంబందించిన పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... నెల్లూరుకు చెందిన రిటైర్డ్ లెక్చలర్ వేణుగోపాల్ అనే వ్యక్తికి సంబందించిన బంధువులు అనంతపురంలో మృతిచెందగా చూడటానికి తమ సమీప బంధువులైన మదనపల్లికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయచంద్ర, కానిస్టేబుల్ చలపతి, లెక్చలర్ నాగేంద్రతో కలసి కారులో వచ్చాడు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కారు నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి సమీపంలో ఆగి ఉన్న ట్రిప్పర్ లారీని ఢీకొని పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ జయచంద్ర (60), కానిస్టేబుల్ చలపతి(56), లెక్చలర్ నాగేంద్ర (58) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. మృతులు ముగ్గురు సొంత అన్నదమ్ములు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. ప్రమాద విషయం తెలుసుకున్న కదిరి సీఐ నాగేంద్ర తనకల్లు ఎస్ఐ గోపీ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జె. నాగరాజు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి లభిస్తుందని ప్రత్యక్షంగా పరోక్షంగా పలువురికి ఉపాధి దొరుకుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జె. నాగరాజు పేర్కొన్నారు. జిల్లాలో తరచూ అతివృష్టి, అనావృష్టి కారణాలతో వ్యవసాయంతో రైతాంగం నష్టాల పాలవుతోంది. జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేకపోవడం వల్ల కూడా యువతకు ఉపాధి దొరకక నగరాలకు తరలిపోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి తగిన చర్యలు చేపట్టాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అనేక రాయితీలు కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పనకు శ్రీకారం చుడుతున్నాయి. పెద్ద పరిశ్రమలకు సైతం భూమి, విద్యుత్ తో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటి సమస్య తీరుతోంది. భూమి, మానవ వనరులతో పాటు జాతీయ రహదారులు నిర్మిస్తుండటం పరిశ్రమ స్థాపనకు జిల్లా అనుకూలంగా మారుతోంది. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు గురించి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జె. నాగరాజు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి వీటిలో సూక్ష్మ, చిన్న, మధ్యతర, పెద్ద పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి?

జవాబు : జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు 8,898 ఉన్నాయి. ఇవి రూ. 1903 కోట్ల పెట్టుబడి తో స్థాపించబడి ఉన్నాయి. వీటి ద్వారా 55,612 మందికి ఉపాధి లభిస్తోంది. పెద్ద పరిశ్రమలు 48 ఉన్నాయి. ఇందులో రూ. 16.457 కోట్ల పెట్టుబడితో నడుస్తున్నాయి. వీటి ద్వారా 25,682 మందికి ఉపాధి దొరుకుతోంది. వివిధ దశల్లో భారీ పరిశ్రమలు 28 నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో రూ.20,700 కోట్ల పెట్టుబడి పెట్టడం జరుగుతోంది. ఈ నిర్మాణాలు పూర్తి అయితే 28,573 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. ఎక్కువగా పరిశ్రమలు హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.

ప్ర : పరిశ్రమల ఏర్పాటుకు నూతన ఔత్సాహితులకు మీరు ఇస్తున్న సహకారం వివరించండి?

జ : పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే నూతన పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూమి కేటాయింపులు మొదలుకొని వాటికి కావాల్సిన అనుమతులు త్వరగతిన రావడానికి తగు చర్యలు తీసుకుంటాం. తద్వారా అర్హత ఉన్న పరిశ్రమలకు ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పాలసీ మేరకు 5 ఏళ్ల పాటు రాయితీలు అందించడం జరుగుతుంది. ఇందులో పెట్టుబడిలో రాయితీ, విద్యుత్ రాయితీ, జి ఎస్ టి లో రాయితీ, స్టాంప్ డ్యూటీ రాయితీ, భూమి కేటాయింపులో రాయితీ మొదలగు వాటిని సమకూర్చడం జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ లు అయితే మరిన్ని రాయితీలు అందుకోవచ్చు.

ప్ర: పరిశ్రమల స్థాపనకు ఉండాల్సిన అర్హతలు ఏమిటి?

జ : పెట్టబోయే పరిశ్రమపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. భూమి కలిగిన లేదా కొనుగోలు చేసిన వాటితో పాటు సొంతంగా పెట్టుబడి పెట్టగలిగిన స్తోమత కలిగి ఉన్న లేదా బ్యాంకు రుణ సదుపాయాలు వల్ల కూడా పరిశ్రమ స్థాపించుకోవచ్చు.

ప్ర : గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి జిల్లాలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారు? మీ సహకారం ఏమిటి?

జ : సింగల్ డెస్క్ పోర్టరు ద్వారా ఇప్పటివరకు 4054 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన వారికి 21 రోజుల లోపు అనుమతులు ఇస్తాం. ఇందులో ముఖ్యంగా విద్యుత్ సదుపాయం, భవన నిర్మాణ ప్లాన్, కర్మాగారాల శాఖ అనుమతి, కాలుష్య నియంత్రణ కంట్రోల్ శాఖ అనుమతి, పట్టణ అభివృద్ధి అథారిటీ మంజూరు, అగ్నిమాపక లైసెన్స్, భూగర్భ జల శాఖ అనుమతులు మంజూరుకు సహకారం అందిస్తాం.

ప్ర : జిల్లాలో ఏయే పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంది?

జ : ప్లాస్టిక్ వాటి అనుబంధ పరిశ్రమలు ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్ రంగంలో వస్త్రాల తయారీ, ప్లాస్టిక్ పైపులు డ్రిప్పు పైపులు ఆహార శుద్ధి పరిశ్రమలు, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, స్టీల్ తయారీ, ఉడన్, పవర్ లూమ్స్, సిల్క్ స్టిచ్చింగ్, సిల్క్ రీలింగ్, పాల ఉత్పత్తి, చిరుధాన్యాల ప్రాసెసింగ్ తదితర పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలంగా ఉంది.

ప్ర : ప్రధానంగా మీ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, విధి విధానాలు ఏమిటి?

జ : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పెట్టుబడులు పెట్టే వారికి అవగాహన కల్పించడం, బ్యాంకు రుణ సదుపాయాల కల్పన, పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించడం, రాయితీలు మంజూరు చేయడం, జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ అధ్యక్షతన జరిగే పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక జిల్లా కమిటీలో చర్చించి, రాష్ట్రస్థాయి కమిటీకి నివేదించడం జరుగుతుంది.

ప్ర: మీశాఖలో సిబ్బంది కొరత ఉందా? ఔత్సాహిక పారిశ్రామిక యువతకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి?

జ: ఒక అసిస్టెంట్ డైరెక్టర్, మూడు పరిశ్రమల అభివృద్ధి అధికారుల పోస్టులు భర్తీ చేయాల్సుంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా రాష్ట్ర దేశ ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలి. రాష్ట్ర జిడిపి, తలసరి ఆదాయం పెంపొందించడానికి ముందుకు రావాలి. వారి అభివృద్ధి తో పాటు సమాజ అభివృద్ధికి కృచేయాలని కోరుతున్నాము.

ఖాద్రీశుని దర్శనార్థం క్యూలో నిల్చొన్న భక్తుల

ఖాద్రీశుని సన్నిధిలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. నరసింహస్వామికి ప్రత్యేకంగా అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. శ్రీఖాద్రీ నృసింహుని దర్శనార్థం జిల్లా నుంచే కాకుండా కర్నాటక, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి రావ డంతో ఆలయ ఆవరణతో పాటు పరిసరాలు కిక్కిరిసాయి. స్వామి దర్శనార్థం భక్తులు తెల్లవారు జాము నుంచే క్యూలైన్లలో నిల్చున్నారు. ఉదయం స్వామి వారి నిజరూప దర్శనం, అభిషేక దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అలాగే భక్తులు స్వామి వారికి తలనీలాలు, తులాభారం లాంటి మొక్కు బడులు సమర్పించారు. భక్తుల రద్దీ, సౌకర్యార్థం అతి శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు నైవేద్య ప్రసాదం అందజేశారు. అలాగే భక్తులు నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు సంగమేశ్వరుని రథోత్సవం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక బుక్కపట్నం రోడ్డులో చెరువు కట్ట వద్ద వెలసిన శ్రీసంగమేశ్వరస్వామి రథోత్సవం సోమ వారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజు తెలిపారు. ఆదివారం రాత్రి సంగమేశ్వరుని ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రథోత్సవంలో దాతలు ప్రజలకు తాగునీరు, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

జవాను పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

వీరజవానుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదివారం గోరంట్ల మండలంలోని కళ్లితండా వెళ్లి వీరజవాను మురళి నాయక్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవాను తల్లిదండ్రులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ దేశ సరిహద్దులో శత్రు దేశం పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీరోచితంగా పోరాడిన మురళినాయక్ చివరకు దేశం కోసం ప్రాణాలర్పించారని కొనియాడారు. మురళినాయక్ మృతి ఆ కుటుంబానికే కాదు, దేశానికి తీరని లోటు అన్నారు. మురళినాయక్ ఎప్పటికీ కోట్లాదిమంది భారతీయుల హృదయాల్లో నిలిచిపోతారని తెలిపారు. అనంతరం వారు వీరజవాను అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఘనంగా వైష్ణవ నృసింహ జయంతి

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని తుమకూరు రోడ్డులో వెలసిన కణివే లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం వైష్ణవ నృసింహస్వామి జయంతిని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో ఆరాధన, పంచామృతాభిషేకం, వేదపఠనం, విష్ణుసహస్రనామ పారాయణం, నరసింహ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం మంత్ర పుష్పాలు, మహామంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కణివే లక్ష్మీనరసింహ స్వామి సేవా సమితి సభ్యులు, అర్చకుడు ఎస్.నరసింహ, గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం జయంతి వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, ఉపాధ్యక్షులు పుట్లూరు నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. సంకారపు జయశ్రీ మాట్లాడుతూ ఈ ఆలయానికి 600 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

పాఠశాలల సమస్యలపై పోరాటం జయప్రదం చేయండి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై చేపట్టనున్న పోరాటాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న అధ్యక్షతన ఒకరోజు ఉద్యమ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించిన సమస్యలపై పాఠశాల విద్యా శాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం అన్ని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జీవో-117 రద్దు చేస్తా మని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించటం విచారకరంఅన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 15వ తేదీ విద్యాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం దేశ సరిహద్దులో శత్రు దేశం పాకిస్తాన్ చేసిన దాడుల్లో మృతి చెందిన వీరజవానుకు అశ్రునివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాబు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు డి.నరసింహప్ప, తాహిర్‌వలి, నరేష్, నారాయణస్వామి, అనిల్‌కుమార్, సీనియర్ నాయకులు వీఎన్.మాలింగప్ప, వై.జోగప్ప, టీ.మూడ్ల గిరియప్ప, బంగారు లింగ, అనిల్‌కుమార్, హరికృష్ణ, కేశవ్‌ప్రసాద్, కదురన్న, ఈ.నరసింహమూర్తి, నంజప్ప, దేవరాజ్, సురేష్‌బాబు, ఈశ్వర్, ఓబన్న, వేదాచలం, దత్తాత్రేయ, లక్ష్మీ నారాయణస్వామి, జి.ఉమేష్, నాగేంద్ర, మద్దిలేటి, రామాంజనేయులు, ఉగ్ర నరసింహ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిహెచ్ఒలు చేస్తున్న నిరసన కార్యక్రమం 13వ రోజుకు చేరింది. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదివారం పుట్టపర్తికి రావడంతో మధ్యాహ్నం వారికి వినతి పత్రం అందజేసేందుకు సిహెచ్ఒలు పట్టంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు బారులు తీరారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకుని సమస్య తలెత్తకుండా వారిని కార్యాలయ ఆవరణ లోపలికి పంపించి గేటు వేశారు. దీంతో వారు అక్కడి నుంచే ఫ్ల కార్డులు పట్టుకుని 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ సిహెచ్ఒలు నినాదాలు చేశారు. ఆ సమయంలో అటుగా వాహనంలో వెళ్తున్న నారా లోకేష్ వారిని గమనించి దగ్గరకు పిలిచి సమస్యలపై ఆరా తీశారు. సిహెచ్ఒలు మంత్రి నారా లోకేష్‌కు తమ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒలు కార్తీక్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, అరుణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సిహెచ్ఒలు

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సరోజమ్మ కళాజాత బృందం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై నివారణపై అవగాహన కల్పిం చారు. హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలా జాగ్రత్తలు తీసు కోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలాగ కలిసి జీవించాలి, హెచ్ఐవి, ఎయిడ్స్ క్షయ వ్యాధి సంబంధం, సుఖ వ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగం, తదితర అంశాలపై వీధి నాటిక ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెనుకొండ ఐసిటిసి కౌన్సిలర్ అరవింద్, జన జాగృతి పియు ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఒఆర్‌డబ్ల్యు శశికళ, హరిత, పిఇలు, ప్రజలు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కళాజాత బృందం

ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 12వ పిఆర్‌సి కమిటీ ఛైర్మన్‌ను నియమించి, ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కే.మనోహర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు కొన్ని విషయాలు వెల్లడించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని, కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ డిఏలు విడుదల చేయాలని, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. సెప్టెంబర్-2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయు లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, బిల్లే రామాంజనే యులు, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, కృష్ణతేజ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఆన్‌లైన్‌లో డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ఆంజనేయులు తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సంప్రదించాలని, లేదా 9392141545కు ఫోన్ చేయాలన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ(సోమవారం) నుంచి 19వ తేదీ వరకూ ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఐఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 36 కేంద్రాల్లో, మధ్యాహ్నం 22 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

పేదలకు కంటి వెలుగు ప్రసాదించడమే లక్ష్యం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ప్రజలకు కంటి వెలుగు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని అధ్యక్షులు జయసింహా, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిన్ను సూర్యనారాయణ జ్ఞాపకార్థం భార్య వసుంధరమ్మ, కుమారులు సురేష్‌బాబు, సునీల్‌కుమార్, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో ఉచితంగా వైద్య చికిత్స చేయ డంతో పాటు ఆపరేషన్లకు ఎంపికైన వారికి బెంగళూరులో భోజనం, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తా మన్నారు. ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 173 మందికి కంటి పరీక్షలు నిర్వహిం చగా 138 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం దాతలు, కంటి వైద్యుడిని రోటరీక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివయ్య, సుశీల, రమేష్‌బాబు, కొండయ్య, రామకృష్ణ, కృష్ణమూర్తి, మనోహర్‌గుప్తా, ఉట్టి నాగరాజు, రామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్యశిబిరానికి విశేష స్పందన

పజాశక్తి - చిలమత్తూరు

బెంగళూరులోని ప్రముఖ ఎంఎస్.రామయ్య హాస్పిటల్ సహకారం తో ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శ్రీసద్గురు యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి అసోసియేట్ మేనేజర్ డా. అరుణ్ కుమార్ మాట్లాడుతూ 'ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు మెరుగైన వైద్య సదుపా యాలు అందించడమే మా లక్ష్యం అన్నారు. ప్రతిఒక్కరూ ఎంఎస్. రామయ్య హాస్పిటల్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన 25 మంది నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. తీవ్రమైన జబ్బు ఉన్న వారికి బెంగళూరులోని ఆసుపత్రిలో 70 శాతం రాయితీతో వైద్యం, మెడిసిన్, చెకప్‌లపై 50 శాతం రాయితీ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్య సిబ్బందితో పాటు, సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్, ఆ నలుగురు ట్రస్ట్ వ్యవస్థాపకులు రమణ పాల్గొన్నారు.

చికిత్స అందిస్తున్న ఎమ్మెస్ రామయ్య హాస్పిటల్ డాక్టర్లు

మురళీనాయక్ తండాగా పేరు మార్చాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

దేశ సరిహద్దులో పహారా కాస్తూ శత్రు దేశం పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళినాయక్ మృతికి కదిరి కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలమత్తూరు మోహన్ గాంధీ సంతాపం ప్రకటించారు. మురళినాయక్ స్వగ్రామమైన గోరంట్ల మండలంలోని కళ్లితండాకు మురళినాయక్ తండాగా పేరు మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా ఆయన అమరత్వానికి నివాళిగా, భావితరాలకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురుస్వామి విజయ్ కుమార్ తెలిపారు. రెండో రోజైన ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిం చారు. సాయంత్రం అయ్యప్ప స్వామి భజన మందిరం నుంచి నూతన ఆలయం వరకూ స్వామి మూలమూర్తులను పట్టణ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తిలకించడానికి అయ్యప్ప మాల ధారణ భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, బండ్లపల్లి వెంకట జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

స్వయంభువేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే పిఎలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు సమీపంలోని స్వయంభువేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ పనులను ఆదివారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్రబాబు, బాలాజీ పరిశీలించారు. వారికి ముందుగా అర్చకులు, ధర్మకర్తలు, గ్రామపెద్దలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ విశిష్టత గురించి తెలుసుకుని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ గతంలో ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం చేసిన విషయాన్ని ఆలయ ప్రతినిధులు గుర్తుచేయగా, భవిష్యత్తులో కూడా ఆలయానికి తమ సహకారం కొనసాగిస్తామని సురేంద్రబాబు, బాలాజీ హామీ ఇచ్చారు. అనంతరం వారు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, నందీశప్ప, టేకులోడు సర్పంచి బయపరెడ్డి, మాజీ ఎంపిటీసీ ఆంజనేయులు ఉన్నారను.



ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎలను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు

బైక్‌ను ఢీకొన్న ఆటో.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆటో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘ టన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గోరంట్ల మండలంలోని కరావలపల్లి తండాకు చెందిన లక్ష్మీపతినాయక్, మల్లేష్‌నాయక్ ద్విచక్ర వాహనంపై పుట్టపర్తికి బయల్దేరారు. వారు స్థానిక ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్స్ ఉండడంతో నెమ్మదిగా వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో లక్ష్మీపతినాయక్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటాహుటిన సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయకలయిక

నిడిమామిడి ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని నిడిమామిడి జడ్పీ హైస్కూల్‌లో 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఆనాటి మధుర జ్ఞాపకాలను చిన్ననాటి స్నేహితులు, ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులైన రాజశేఖర్, బాలకృష్ణ, మస్తాన్, మల్లికార్జున్‌రెడ్డి, నాగరాజు, వెంకటరమణ, నజీర్ విద్వాన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కత్తివారిపల్లి నాగరాజు, కోట్లపల్లి గణేష్, సురేష్, దాము, నరేష్, హరినాథ్, కృష్ణమూర్తి, శ్రీకాంత్, రాజు, ఓబుళపతి, శ్రీనివాసులు, నరసింహమూర్తి, సునీల్, నాగరాజు, జీవన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి తిరుమలేష్‌కు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని దేమకేతేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి ఈడిగ తిరుమలేష్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో సర్పంచి ఇంటికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. సర్పంచి తిరుమలేష్ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామం అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజల మద్దతుతో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది శబరి, ప్రకాష్, మోహన్, బాబ్‌జాన్, నవీన్, బోగిరెడ్డి, గోపాల్, కుమార్, మంజు, లక్ష్మీనారాయణ, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి తిరేమలేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాఠశాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తూ, ముందస్తు అడ్మిషన్లను చేపడుతున్న నారాయణ, శ్రీ చైతన్య పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ అఫ్రిది డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణ, చైతన్య కార్పొరేట్ పాఠశాలలు సెలవు తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలల వద్దకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్రిది మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నప్పటికి విద్యా శాఖ అధికారులు వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు వేసవి సెలవులను ప్రకటించిందని అందులోను ఆదివారం సైతం తరగతులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోక పోతే ఆలాంటి విద్యా సంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేపడతామని. దీనికి విద్యాశాఖ అధికారులే భాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కో కన్వీనర్ అజ్మల్, నాయకులు వినీత్, మోహన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

30 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-తాడిమర్రి

స్థానిక జడ్పీ హైస్కూల్ లో 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. సుమారు 30 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట కలవడంతో భావోద్వేగాలకు లోనయ్యారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించు కున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆనాటి గురువులను సత్కరించారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి స్నేహితురాలు మద్దెలచెరువు నాగరత్నమ్మకు చిన్నవయసులోనే భర్త చనిపోవడంతో అందరూ కలిసి ఆమెకు రూ. 28,500 అందజేశారు.

నిడిమామిడి ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోడిపల్లిలో టీడీపీ నాయకుల దౌర్జన్యం

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలం కోడిపల్లి గ్రామంలో అధికార పార్టీ అండ దండలతో కొంతమంది టీడీపీ నాయకులు గ్రామంలో దౌర్జన్యాలు చేస్తూ అలజడులు సష్టిస్తున్నారని, తమ కుటుంబంపై కక్షకట్టి తరచూ దాడులు చేస్తూ, పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని కోడిపల్లికి చెందిన బాధితులు రజియాబాను, బాబాఫకృద్దీన్, వారి కుమారుడు జబీవుల్లా వాపోయారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ ఇబ్బందులను వివరించారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై అధికారి పార్టీ అండదండలతో ఎంపిటీసీ గంగాధర్, నాయకులు నాగరాజ్, ఆనంద్ రెడ్డి, గోపి తదితర నాయకుల ప్రోత్సాహంతో తమ కుటుంబంపై కక్ష కట్టి తరుచూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నెల రోజుల క్రితం నాగేపల్లివద్ద ఉన్న అనధికారిక బార్ అండ్ రెస్టారెంట్ వద్ద తమ గ్రామానికి చెందిన సుభాష్, శ్రీకాంత్ అనే వ్యక్తులు ఘర్షణ పడ్డారన్నారు. అదే రోజు సాయంత్రం కోడిపల్లి గ్రామంలో సుభాష్, శ్రీకాంత్ అనే వ్యక్తులు ఘర్షణ చేసుకుంటుండగా, గమనించిన తమ రెండవ కుమారుడు దాదా ఖలందర్ ఇద్దరికీ నచ్చచెప్పి గొడవ నివారించారన్నారు. ఇది జరిగిన వాస్తవమని దీన్ని ఆసరా చేసుకున్న కొంతమంది టీడీపీ నాయకులు కక్ష కట్టి సుభాష్‌తో తన రెండవ కుమారుడు దాదాఖలందర్ పై పోలీసులకు ఫిర్యాదు చేయించారన్నారు. పోలీసులు ఏమాత్రం విచారించకుండా టీడీపీ నాయకుల మాటలు విని ఏకపక్షంగా తన కుమారుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని విమర్శించారు. తన కుమారుడు బెంగళూరులో ఉన్నాడన్న విషయం తెలుసుకున్న పోలీసులు రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లి అరెస్టు చేసి తీవ్రంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేశారని ఆరోపించారు. తన కుమారుడు దాదాఖలందర్ తప్పు చేసి ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమని అనవసరంగా పోలీసులు తమ పట్ల చిన్నచూపు చూపి అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేపాక్షి ఎస్ఐతో పాటు కొంతమంది పోలీసులు తన కుమారుడిని ఎలా కొట్టారో ఏ విధంగా గాయాలు అయ్యాయో ఫోటోలు చూపిస్తూ కన్నీటిపర్యంతం అయ్యారు. ఇదే విధంగా 2024లో జరిగిన పీర్ల పండుగ ఉత్సవాల రోజు కొంతమంది టీడీపీ నాయకులు తమ ఇంటిలోకి చొరబడి తనపై దాడి చేశారని బాధితురాలు రజియా భాను విమర్శించారు. ఈ దాడిలో గాయపడిన తాను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరానని ఆ సమయంలో జరిగిన విషయమంతా పోలీసులకు ఫిర్యాదు. చేసినా తమకు న్యాయం చేయలేదన్నారు. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు కొంతమంది టీడీపీ నాయకులు తమ కుటుంబ సభ్యులపై దాడి చేస్తున్నారని, వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమను జిల్లా ఎస్‌పి కాపాడాలని కోరారు.

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక బస్టాండ్ కూడలిలో ఆదివారం ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయాన్ని జిల్లా హ్యూమన్ రైట్స్ సభ్యులు ప్రారంభించారు. ముందుగా అగ్నివీర్ జవాను మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని, వారి సమస్యలు తెలిపితే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో వర్కింగ్ చీఫ్ ఎంఎస్.షబ్బీర్, సెక్రటరీ మహబూబ్‌బాషా, హఫీజ్, జయరామ్ నాయుడు, నాగముణి, ఈశ్వరప్ప, కృష్ణమూర్తి, రామచంద్ర, లక్ష్మీదేవి, కేశవ, ముస్తఫా, సురేష్ కుమార్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన హ్యూమన్ రైట్స్ సభ్యులు